క్లుప్తంగా

మాదక ద్రవ్యాల నియంత్రణకు సహకరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పోలీసులు, భరోసా సెంటర్, షీటీంల ఆధ్వర్యంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాల ముప్పు గురించి తెలుసుకోవాలన్నారు.

ఎఫ్‌డీవోను కలిసిన ఫారెస్టు రేంజ్ ఆఫీసర్



ఎఫ్‌డీవోకు మొక్క అందజేస్తున్న భానేశ్

రెబ్బెన: ఆసిఫాబాద్ ఎఫ్‌డీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దేవిదాస్‌ను గురువారం రెబ్బెన ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ భానేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేంజ్ పరిధిలో చేపడుతున్న అటవీ సంరక్షణ చర్యలు, పోడుసాగు నివారణ, వన మహోత్సవం సందర్భంగా నాటే మొక్కల వివరాలతో పాటు పలు అంశాలపై చర్చించారు.

'సీఈఐఆర్'పై అవగాహన

కెరమెరి: మండలంలోని మొబైల్ షాపు యజమానులకు సీఈఐఆర్ టెక్నాలజీపై ఎస్సై ఎస్. మధుకర్ అవగాహన కల్పించారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైన ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

'మహిళా సంఘాల్లో పొదుపు పెంచాలి'

కెరమెరి: మహిళా సంఘాల్లో పొదుపు పెంచాలని ఐకేపీ సీసీ సత్తయ్య, కౌసల్య అన్నారు. గురువారం మండలంలోని పాట్నాపూర్, నారాయణగూడ, సుర్దాపూర్ గ్రామాల్లో వీవో మహిళలకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. స్త్రీనిధి, బ్యాంకు రుణాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

రిటైర్డ్ ఉద్యోగికి చెక్కు అందజేత

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో విధులు నిర్వహిస్తూ మెడికల్ ఇన్ వ్యాలిడేట్ అయిన రామగిరి రాజంకు గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏక మొత్తంగా చెక్కును జీఎం విజయ్ భాస్కర్ రెడ్డి అందజేశారు. ఖైరిగూర ఓసీపీలో జనరల్ మజ్దూర్‌గా పని చేసిన రాజం మెడికల్ ఇన్ వ్యాలిడేట్ కాగా ఏక మొత్తం చెల్లింపు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దాంతో ఆదాయపు పన్ను మినహాయింపు కాగా మంజూరైన రూ.21.56 లక్షల చెక్కును జీఎం అందజేశారు. ఉజ్వల్ కుమార్ బెహరా, డీవైపీఎం రాజేశ్వర్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ బాబా, ఏఐటీయూసీ నాయకుడు జూపాక రాజేశ్ తదితరులు ఉన్నారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కెరమెరి: మోడిలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ ఒక ప్రకటనలో కోరారు. 18 –45 సంవత్సరాల వయస్సు ఉండి, కెరమెరికి చెందిన వారై, 7వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులన్నారు. 7వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 15లోపు మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు బీఎల్‌వోలకు శిక్షణ

సిర్పూర్(టి): మండలంలోని బీఎల్‌వోలకు శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రహీముద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సార్లు ఎన్నికల నిర్వహణపై బీఎల్‌వోలకు ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: గత రెండు రోజులుగా మండలంలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రియాజ్ అలీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, కుమురం భీం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తడంతో పెద్దవాగు పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరూ కూడా వాగుల వైపు వెళ్లొద్దని పేర్కొన్నారు.

మండుతున్న ధరలు!

- పెరిగిన కూరగాయల రేట్లు
- సామాన్యులు కొనలేని పరిస్థితి
- నియంత్రణలో అధికారులు విఫలం

జిల్లాలో కూరగాయల ధరలు (కిలోకు రూపాయల్లో)..

కూరగాయలు	గత నెలలో	ప్రస్తుతం
టమాటా	30	50
బెండకాయ	30	40
పచ్చిమిర్చి	80	120
కాకరకాయ	40	80
వంకాయ	40	80
అలసంత	30	50
క్యాలీఫ్లవర్	60	100
దొండకాయ	30	60
బీరకాయ	60	120
చిక్కుడుకాయ	60	100



కౌటాల: జిల్లాలో కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. నెల రోజుల క్రితం నిలకడగా ఉన్న ధరలు ప్రస్తుతం రెట్టింపయ్యాయి. చిక్కుడు, బీరకాయ, క్యాప్సికమ్, మిర్చి, క్యాలీఫ్లవర్ వంటి కూరగాయల ధరలు సెంచరీ దాటాయి. ఇవి నెల క్రితం కిలో రూ.40 పలకగా, ప్రస్తుతం కిలో రూ.80 నుంచి రూ.100 లోపు ఉండడంతో పేద, మధ్యతరగతి వారికి ఏం కొనాలో పాలు పోవడం లేదు. పెరిగిన ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

సాగు అంతంతే..

వరుస నష్టాలతో రైతులు కూరగాయల సాగుకు దూరమవుతున్నారు. క్రమంగా ప్రభుత్వాలు రాయితీలు ఎత్తేయడం, పెట్టుబడి పెరగడంతో ఉద్యాన సాగు భారంగా మారింది. దీనికితోడు విత్తన, ఎరువుల, పురుగు మందుల ధరలు పెరిగాయి. జిల్లా రైతులు పంటలు సాగు చేసినా కూరగాయల పంట నిల్వకు కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో లేకపోవడంతో పలువురు బడావ్యాపారులు కూరగాయల ధరలు ఇష్టారీతిన పెంచుతున్నారు. దీంతో చిరు వ్యాపారులు ధరలు పెంచి కూరగాయలు వినియోగదారులకు అమ్ముతున్నారు. జిల్లాలో కూరగాయల పంటల సాగుకు సాగునీటి సౌకర్యం లేకపోవడంతో జిల్లాలో కూరగాయల పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపకపోవడం, క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతుండడంతో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేస్తుండడంతో ధర అధికమవుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఇబ్బందుల్లో పేదలు

వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా ధరలు తగ్గకపోగా.. కొద్ది రోజులుగా పెరుగుతున్నాయి. గడిచిన పదేళ్లుగా మే, జూన్, జూలై నెలల్లో కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షాలు కురిశాయి. అక్కడక్కడ టమటా, ఇతర కూరగాయల సాగు కోసం నారు పోశారు. జూలైలో కురుస్తున్న వర్షాలకు కూరగాయలు సాగు చేసే అవకాశం ఉంది. ఈ పంట ఆగస్టు చివరి వారం, సెప్టెంబర్ మొదటి వారంలో చేతికొస్తుంది. అప్పటి వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది.

ఆర్థిక భారం..



ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు చూస్తుంటే భయంగా ఉంది. పొద్దంతా కూలీ పని చేసినా ఇంటికి సరిపడా కూరగాయలు కొనలేకపోతున్నాం. రోజంతా పనిచేస్తే కూలీ రూ.300 వస్తుండగా కూరగాయలు కొనడానికి అంతకు మించి ఖర్చవుతోంది. పెరిగిన కూరగాయల ధరలతో ఆర్థిక భారం పడుతోంది.

– వనజ, గృహిణి, యాపలగూడ

కేంద్రంపై అసత్య ఆరోపణలు మానాలి

- ఎంపీ గోడం నగేశ్



మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు కేంద్ర ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 49 విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. బెజ్జూర్ రేంజ్ పరిధిలో రాబందులు ఉన్నాయని, వాటిని కాపాడుకోవాలని 2014లో అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ సీఎఫ్‌కు నివేదిక పంపించామని గుర్తు చేశారు. తాజాగా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గత జూన్ మాసంలో జీవో 49 తీసుకవచ్చిందన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ఇటీవల జిల్లాకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి జీవో 49 రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. జీవోను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చినట్లు ప్రజలను మభ్యపెట్టడం సరికాదన్నారు. అనంతరం ఇటీవల ఎన్నికైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గాన్ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, అరిగెల మల్లికార్జున్, కొట్నాక విజయ్, సెర్ల మురళి, ఖాండ్రె విశాల్, మాటూరి జయరాజ్, సొల్లు లక్ష్మి, కృష్ణకుమారి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు దిశగా ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి అజ్మీర ప్రేమ్‌సింగ్

ఆసిఫాబాద్: జిల్లాలో ఉద్యానవన వాణిజ్య పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని కమిషన్ ఆఫ్ హార్టికల్చర్, జిల్లా ప్రత్యేకాధికారి అజ్మీర ప్రేమ్ సింగ్ అన్నారు. గురువారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎండి అబ్దుల్ నదీమ్, కాగజ్‌నగర్ ఉద్యాన అధికారి సుప్రజ, మ్యాట్రిక్స్ కంపెనీ సీఈవో ఉదయ్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి కలెక్టరేట్‌లోని జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి, జామ, నిమ్మ, పనస, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్ సాగుతో పాటు ఆయిల్ పాం తోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు. అంతర పంటలుగా కూరగాయలు, పూల తోటలు, సుగంధ ద్రవ్యాలు, పెసర, మినుములు వంటి పప్పు ధాన్యాలు సాగు చేసుకోవచ్చన్నారు. జిల్లా ఉద్యానవనశాఖ నుంచి కూరగాయల సాగుకు 50 శాతం సబ్సిడీ, శాశ్వత పందిరి, మల్చింగ్ సాగుకు 50 శాతం, బిందుసేద్య పరికరాలకు 90 శాతం, స్ప్రింకర్లు, తుంపర సేద్య పరికరాలకు 75 శాతం, వెదురు సాగుకు 75 శాతం, పవర్‌వీడర్, పవర్ టిల్లర్, నాప్‌సాక్ స్ప్రేయర్, బ్రష్ కట్టర్‌లపై 40 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నాణ్యత గల ఆయిల్ పాం మొక్కలను రైతులకు అందించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఉద్యాన, వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లను కూల్చివేయాలి



ఇంటిని కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కూల్చివేయాలని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి యశ్వంత్ అన్నారు. గురువారం పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియాలో శిథిలావస్థలో ఉన్న మూడిళ్లను కూల్చివేశారు. పట్టణంలో ఇప్పటి వరకు 12 ఇళ్లను గుర్తించి నోటీసులు అందజేశామన్నారు. కార్యక్రమంలో టీపీబీవోలు ప్రీతమ్, హరికృష్ణ, రాహుల్, చైన్‌మెన్ రాజేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంగ్లభాష అభివృద్ధిపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఆంగ్లభాష అభివృద్ధికి ఉపాధ్యాయులు శ్రద్ధవహించాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆంగ్లభాష అభివృద్ధిపై ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో 3 నుంచి ఐదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆంగ్లభాషలో సామర్థ్యాల పెంపునకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఏసీఎం ఉద్ధవ్, ఏటీడీవో చిరంజీవి, ఉట్నూర్ ఏసీఎంవో జగన్, జైనూర్ ఏటీడీవో శ్రీనివాస్, డీఎస్‌వో మీనారెడ్డి, లీప్ ఫార్వర్డ్ సంస్థ ప్రతినిధులు లక్ష్మణ్‌రావ్, ప్రశాంత్, సునీత, రవళి, రమేశ్, మ్యాతిన్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ బుద్దె రవీందర్

ఆసిఫాబాద్‌అర్బన్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఇతరులకు మార్గదర్శకులుగా నిలవాలని ఆసిఫాబాద్ సీఐ బుద్దె రవీందర్ విద్యార్థులకు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సతీశ్, భరోసాటీం ఎస్సై తిరుమల, షీటీం సిబ్బంది స్వప్న, కళాశాల నిర్వాహకులు సాయిని రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మోహన్, అధ్యాపక బృందం, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ వెంటనే అమలు చేయాలి

పెంచికల్‌పేట్: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంత కుమారి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కేర్‌టేకర్, వార్డెన్లను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి రాజ్‌కమలాకర్‌రెడ్డి, మహేశ్, సాయికృష్ణ, ఎస్‌వో కవిత, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

జోరు వానలో బడికి..



ఓ వైపు భారీ వర్షం కురుస్తున్నా గొడుగులు పట్టుకుని విద్యార్థులు బడికి బయలుదేరారు. పాఠశాలకు వెళ్లకుంటే చదువులో నష్టపోతామనే భయంతో దహెగాం మండలకేంద్రంలోని విద్యార్థులు వర్షంలోనూ పాఠశాలకు వెళ్తున్న దృశ్యాలను గురువారం 'సాక్షి' క్లిక్ మనిపించింది. – దహెగాం

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



కాగజ్‌నగర్‌టౌన్: సాయిబాబా పాదుకలకు పూజలు చేస్తున్న మహిళలు



ఆసిఫాబాద్: హారతికి హాజరైన భక్తులు



కౌటాల: పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శిర్డీ సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇందారపు మధూకర శర్మ, గట్టు సాయిశర్మ ఆధ్వర్యంలో ఉదయం సాయినాథుడికి పూజలు, అభిషేకాలు అనంతరం ఆలయంలో హోమం నిర్వహించారు. మధ్యాహ్న హారతికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులు పల్లకిసేవ చేపట్టారు. ఆలయంలో అన్నదానం నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు రెబ్బెన, కెరమెరి, వాంకిడి మండలాల భక్తులు సాయినాథుడిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తాటిపెల్లి రమేశ్, రావుల దిలీప్, తపాసె నాందేవ్, గంధం వినోద్, రావుల శంకర్, భక్తులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సాయిబాబ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించారు. బాబా పాదుకలకు మహిళలు పూజలు చేశారు. అనంతరం హారతి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నాగేశ్వర్ రావు, సభ్యులు లక్ష్మీనారాయణ, శేఖర్, గుళ్లపల్లి వెంకటేశ్వర్లు, మురళి, శివ, సతీశ్, మహిళ సభ్యులు జ్యోతి, పద్మావతి, భారతి, భాగ్యలక్ష్మి, భార్గవి, భక్తులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని భక్తులు భక్తిశ్రద్ధలతో గురువారం గురుపూర్ణమి వేడుకలు నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నుంచి పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. మండలంలోని గుండాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురుపూర్ణమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. హెచ్‌ఎం నానాజీ, ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య, కమిటీ సభ్యులు కళ్యాణి, రాములు, సత్తయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

పూలాజీ బాబా చూపిన మార్గంలో నడవాలి

జైనూర్: ప్రతి ఒక్కరూ శ్రీ పరమహంస సంత్ సద్గురు పూలాజీ బాబా చూపిన మార్గంలో నడవాలని సిద్ధేశ్వర సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ దాదా ఇంగిలే అన్నారు. గురువారం మండలంలోని పట్నాపూర్ సిద్ధేశ్వర సంస్థాన్‌లో గురుపౌర్ణమి ఉత్సవాల్లో తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ దాదా ఇంగిళే, మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే ససానే నాందేవ్, ఆంధ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖాడే విష్ణు, ఆదిలాబాద్ బెటాలియన్ డీఎస్పీ రఘునాథ్ చౌహాన్, కార్యదర్శి దుర్రే సుభాష్, రంగారావు, దాదారావు, తదితరులు ఉన్నారు.

బెజ్జూర్: గురు పౌర్ణిమ వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు జరుపుకున్నారు. బ్రహ్మంగారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు శ్రీనివాసచారి, అనంతమాచార్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. బెజ్జూర్ మాజీ సర్పంచ్ కొండ్రు జగ్గాగౌడ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఏలేశ్వరం పురుషోత్తమాచారి, సంఘం సభ్యులు చాకటి బ్రహ్మయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



ఆసిఫాబాద్: రామాలయంలో గురువులను సన్మానిస్తున్న ఎంపీ గోడం నగేశ్



కాగజ్‌నగర్‌టౌన్: గురువులను సన్మానించిన బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండరామాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేశ్ ఉపాధ్యాయులు, అర్చకులను శాలువాలతో సన్మానించారు. నాయకులు దోని శ్రీశైలం, సెర్ల మురళి, కొట్నాక విజయ్‌కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో..

జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో వ్యాసపూర్ణిమ జయంతి పురస్కరించుకొని గురుపూజో త్సవ కార్యక్రమం నిర్వహించారు. సంచాలిత సమితి కార్యదర్శి నాగుల శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి, వ్యాస మహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. యోగా ఉపాధ్యాయురాలు కొరగంటి వెంకటేశ్వరిని శాలువాతో సన్మానించారు. ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్ రావు, ఆచార్యులు శ్రీరాం సత్యనారాయణ, శారద, అమరావతి, శ్రీకాంత్, పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైందవ ధర్మంలో గురువుకు విశిష్ట స్థానం..

కాగజ్‌నగర్‌టౌన్: హైందవ ధర్మంలో గురువులకు విశిష్ట స్థానం ఉందని బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు వలపదాసు శ్రీదేవి అన్నారు. గురువారం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని గురువులను సన్మానించారు. పాఠశాలలోని ఆచార్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. బీజేపీ నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, పాఠశాల అధ్యక్షురాలు డాక్టర్ అనిత, రమేశ్, దెబ్బటి శ్రీనివాస్, కొండా తిరుపతి, మహిళా మోర్చ నాయకులు పాల్గొన్నారు.

డ్రైయినేజీలు లేక ఇళ్లలోకి వర్షపు నీరు



నాలాలు లేక ఇళ్ల మధ్య చేరిన మురుగునీరు

బెజ్జూర్: బెజ్జూర్ గ్రామపంచాయతీ ఎలకపల్లి(బి) గ్రామంలోని ఎస్సీ కాలనీలో సైడ్ డ్రెయినేజీ లేక వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా వర్షపు నీరు చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సైడ్ డ్రెయినేజీ నిర్మించడం లేదని ఆరోపిస్తున్నారు. వర్షపు నీటితో పాటు ఇళ్లలో మురుగు నీరు చేరడంతో వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.